సాక్షి కామారెడ్డి

శనివారం । 1 । జూలై । 2023

I



బీజేపీతోనే అభివృద్ధి

బీజేపీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజ కవర్గాలలో 'మేరా బూత్.. సబ్ సే మజ్బూత్' కార్యక్రమం నిర్వహించారు.

- IIIలో ▸



మారిన గ్రామాల రూపురేఖలు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాల రూపురేఖలు మారాయని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు.

- IIIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.6 /23.5

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. శీతల గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

7వ తేదీనుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ బియ్యం పంపిణీ ఈనెల 7వ తేదీనుంచి ప్రారంభం కానుంది. ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున అందిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పోలీస్ స్టేషన్ తనిఖీ



మాచారెడ్డి: మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. ఎస్సై సంతోష్‌కుమార్‌తో మాట్లాడి స్టేషన్ పరిధిలో నేరాల గురించి తెలుసుకున్నారు. ఆయా కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. జిల్లా సరిహద్దుల్లో ఉన్నందున ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాలను తనిఖీ చేయడం వల్ల పొరుగు జిల్లాలనుంచి నేరస్తుల రాకను అడ్డుకోవచ్చన్నారు. ఆయన వెంట కామారెడ్డి డీఎస్పీ వి.సురేశ్, కామారెడ్డి రూరల్ సీఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల పరిశీలన



ఎల్లారెడ్డి: పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే శుక్రవారం పరిశీలించారు. రూ. 2 కోట్లతో చేపట్టిన పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, బల్దియా కమిషనర్ జగ్జీవన్ తదితరులు ఉన్నారు.

'మెరుగైన వైద్య సేవలందించాలి'



రామారెడ్డి: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్ వైద్యులకు సూచించారు. శుక్రవారం ఆయన రామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రి పునరుద్ధరణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామారెడ్డి వైద్యాధికారి సురేష్, గతంలో వైద్యాధికారిగా విధులు నిర్వహించిన షాహిద్ అలీ పాల్గొన్నారు.

రేపు గుండెపోటు మరణాలపై సెమినార్

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని సాందీపని జూనియర్ కళాశాలలో ఆదివారం గుండెపోటు మరణాలు అంశంపై సెమినార్ నిర్వహించనున్నారు. ఈ విషయమై కామారెడ్డి సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధి కే.వేణుగోపాల్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు డాక్టర్ బి.బాల్‌రాజు అధ్యక్షతన సెమినార్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు అశోక్ వెంకటనర్సు సెమినార్‌లో పాల్గొని, గుండెపోటుపై అవగాహన కల్పిస్తారని, సమావేశానికి వచ్చినవారి సందేహాలకు సమాధానాలు ఇస్తారని పేర్కొన్నారు.


రేపు తెరవే రాష్ట్ర కార్యవర్గ సమావేశం

కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక(తెరవే) రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించనున్నట్టు వేదిక జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ తెలిపారు. జిల్లాకే చెందిన కవులు పాల్గొనాలని కోరారు.

నేడు 'సెమినార్'

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం 'న్యాయవాద వృత్తి, వృత్తిపరమైన నీతి' అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్టు బార్ ప్రధాన కార్యదర్శి భాగీ చరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకోర్టు ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సెమినార్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

మేఘమా.. వర్షించుమా..



కాలం కరిగిపోతోంది.. కార్తెలు ఒక్కటొక్కటిగా దాటిపోతున్నాయి.. అయినా వరుణుడు కరుణను వర్షించడం లేదు. జిల్లాలో సరైన వానలు లేకపోవడంతో చాలాచోట్ల విత్తనం కూడా వేయలేని పరిస్థితి నెలకొంది. అదును దాటుతుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

- కరిగిపోతున్న కార్తెలు.. నీరుగారుతున్న ఆశలు
- వర్షాలు లేక అన్నదాతల్లో ఆందోళన
- విత్తనం కూడా వేయలేని పరిస్థితి
- జిల్లాలో నామమాత్రంగానే పంటల సాగు



మర్కల్‌లో మక్క విత్తనం వేస్తున్న రైతులు

సాక్షి, కామారెడ్డి: రోహిణి కార్తె గడిచిపోయింది.. మృగశిరలోనూ ఎండలు మండాయి.. ఆరుద్ర కార్తె మీద పెట్టుకున్న ఆశలూ ఆవిరవుతున్నాయి. ఇటీవల కమ్ముకొస్తున్న కారుమబ్బులను చూసి ఆశపడ్డ అన్నదాతలకు చివరికి నిరాశే ఎదురవుతోంది. గంపెడాశలను మోసుకొస్తున్న మబ్బులు.. వర్షించకనే మెల్లిమెల్లిగా మాయమవుతుండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులున్నారు.

వర్షాకాలం సీజన్ ఆరంభంలో మంచి వర్షాలు కురిస్తే రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యేవారు. ఈసారి రుతుపవనాలు ఆలస్యంగా రావడంతో తొలకరి జల్లులు కూడా ఆలస్యమయ్యాయి. అవి కూడా జిల్లా అంతటా కురవనేలేదు. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో నేల తడిసింది లేదు. జిల్లాలో జూన్ మాసంలో సాధారణ వర్షపాతం 144.8 మి.మీ., నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 61.5 మి.మీ. వర్షం కురిసింది. గతేడాది ఇదే సమయానికి 187.0 మి.మీ. వర్షపాతం నమోదవడం గమనార్హం.

మొలకలు రాకపోతే..

వర్షాధార పంటలైన మక్క, సోయా, పత్తి, పెసర, మినుము వంటి పంటలకు సంబంధించి ఇప్పటికే విత్తనాలు వేయాల్సి ఉంది. జిల్లాలో తొలకరి జల్లులే తప్ప భారీ వర్షం లేకపోవడంతో రైతులు విత్తనాలు వేయలేకపోయారు. కొన్నిచోట్ల మాత్రమే విత్తనాలు వేశారు. సదాశివనగర్, గాంధారి, జుక్కల్, మద్నూర్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, పిట్లం, లింగంపేట, తాడ్వాయి తదితర మండలాల్లో పత్తి, మక్క, సోయా విత్తనాలు వేశారు. గతేడాది కొన్ని ప్రాంతాల్లో ఈ పాటికి పంటలో కలుపులు కూడా తీశారు. ఈసారి పరిస్థితులు తలకిందులయ్యాయి. వర్షాలు లేకపోవడంతో విత్తనం వేయడానికి చాలా మంది వెనుకాముందవుతున్నారు. భారీ వర్షాలు కురిస్తేనే విత్తనం వేయాలని యోచిస్తున్నారు. విత్తనం వేసిన వారు మొలకలు వస్తాయో రావోనని ఆందోళన చెందుతున్నారు. వర్షం కురవకపోవడంతో మొలకలు రాకుంటే మళ్లీ విత్తనం వేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు అంతంతే..

వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 2,95,310 ఎకరాల్లో వరి సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు. వర్షాలు లేకపోవడంతో ఇప్పటివరకు 5,708 ఎకరాలలో మాత్రమే వరి సాగులోకి వచ్చింది. 75,030 ఎకరాల్లో మొక్కజొన్న సాగులోకి రావాల్సి ఉండగా ఇప్పటికీ 3,196 ఎకరాల్లోనే పంట వేశారు. 91,302 ఎకరాల్లో సోయాబీన్ సాగు చేస్తారని అంచనా వేయగా.. 5,952 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. 31,335 ఎకరాల్లో పత్తి పంట సాగు అవుతుందని అంచనా వేయగా.. జూలై వచ్చినా ఇప్పటికీ 3,184 ఎకరాల్లోనే సాగైంది.

తుపాన్లు వస్తేనే..

రుతు పవనాల రాకతో వాతావరణం మారినా ఆశించిన వర్షాలు మాత్రం కురవలేదు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క భారీ వర్షం కూడా కురియలేదు. జల్లులు సైతం కొన్నిచోట్లనే కురిశాయి. ఇప్పట్లో కురిసే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో రైతులు వానాకాలం పంటల సాగుపై అయోమయానికి గురవుతున్నారు. గతేడాది తొలినాళ్లలోనే భారీ వర్షాలు కురిశాయి. సీజన్ మొత్తం కురిసిన భారీ వర్షాలతో ఏడాది పాటు భూగర్భజలాలకు ఢోకా లేకుండాపోయింది. అయితే ఈసారి ఇప్పటికీ వర్షాలు కురవకపోవడంతో బోర్లు ఎత్తిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే కొన్ని బోర్లలో నీటి ఊటలు తగ్గిపోయాయి. పరిస్థితి ఇలాగే ఉంటే ఇబ్బందేనని రైతులు పేర్కొంటున్నారు. తుపాన్లపైనే ఆశలు పెట్టుకున్నారు. తుపాన్లు వస్తే గానీ వర్షాలు కురిసే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు.

నారుమడులూ అంతంతే...

ప్రాజెక్టులు, బోర్లు, బావుల కింద ముందస్తు సాగు చేసుకోవాలని ప్రభుత్వం సూచించినా.. రైతులు ఆచితూచి అడుగేస్తున్నారు. నిజాంసాగర్ ఆయకట్టు కింద నస్రుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ ప్రాంతంలో రైతులు నారుమడులు పోశారు. కొందరు రైతులు ముందస్తు నాట్లు కూడా వేశారు. మిగిలిన చోట్ల వరి సాగు అంతంతమాత్రంగానే ఉంది. పోచారం ఆయకట్టు పరిస్థితి దయనీయంగా మారింది. నారుమడులు కూడా పోయలేదు. బోర్లు, బావులపై ఆధారపడిన రైతులూ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఇప్పటివరకు భారీ వర్షాలు కురియకపోవడంతో బోర్లు అంతంతమాత్రంగానే పోస్తున్నాయి. తొందరపడి నారు పోస్తే.. వర్షాలు రాకుంటే పరిస్థితి ఏంటనే అయోమయంలో రైతులున్నారు.

'గ్రూప్-4'కు సర్వం సిద్ధం

- నేడు పరీక్ష నిర్వహణ
- జిల్లాలో 40 పరీక్ష కేంద్రాలు
- హాజరవనున్న 16,101 మంది అభ్యర్థులు



జిల్లా కేంద్రంలోని ఓ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్: టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం గ్రూప్–4 పరీక్ష నిర్వహించడానికి జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో పరీక్ష రాయడానికి 16,101 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారికోసం 40 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్ 1, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పేపర్ 2 నిర్వహించనున్నారు. ఉదయం 9.45 గంటల వరకే పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతి ఇస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించరు.

నిబంధనలు పాటించాలి..

పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందే పరీక్ష కేంద్రం గేటు మూసి వేస్తారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోపలికి అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు బూట్లు వేసుకోవద్దని సూచించారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో మాత్రమే బబ్లింగ్ చేయాలని, పెన్సిల్, ఇంక్ జెల్ పెన్నుతో చేస్తే ఓఎంఆర్ షీట్ చెల్లదని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలో ప్రతి అరగంటకోసారి బెల్ మోగుతుందని, చివరి ఐదు నిమిషాలను సూచిస్తూ వార్నింగ్ బెల్ కూడా మోగిస్తారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోందన్నారు. అభ్యర్థులు నిబంధనలు పాటించాలని సూచించారు.

సీఎం కేసీఆర్ వల్లే పోడు పట్టాలు



పోడు పట్టాలను అందజేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- బాన్సువాడలో లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

బాన్సువాడ: సీఎం కేసీఆర్ వల్లే పోడు సమస్యకు పరిష్కారం దొరికిందని, అర్హులకు పట్టాలు అందుతున్నాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బాన్సువాడలోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి ఆయన పోడు పట్టాలను పంపిణీ చేశారు. ముందుగా రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మృతికి సంతాపం తెలిపారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ గతంలో వానాకాలం వచ్చిందంటే భూమి దున్నడానికి వెళ్లే రైతులు, అటవీ శాఖ సిబ్బంది మధ్య నిత్యం గొడవలు జరిగేవన్నారు. పోడు భూములకు పట్టాలివ్వడంతో ఇకపై ఆ సమస్యలు ఉండవని, ధైర్యంగా ఆ భూములను సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 2,100 మంది బంజారాలకు 4 వేల ఎకరాల పోడు భూములకు సంబంధించిన పట్టాలు అందిస్తున్నామన్నారు. పండించిన పంట అమ్ముకోవడానికి ఈ పాసు పుస్తకం ద్వారా అర్హత లభిస్తుందని, బోర్లు వేసుకోవచ్చునని, సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో నిర్మిస్తున్న సిద్దాపూర్ రిజర్వాయర్‌తో 30 తండాలలోని గిరిజనులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ నీరజా వెంకట్‌రాంరెడ్డి, జెడ్పీటీసీ పద్మ, బాన్సువాడ, బోధన్ ఆర్డీవోలు రాజాగౌడ్, రాజేశ్వర్, జిల్లా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు బద్యానాయక్, గిరిజనాభివృద్ధి అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, నాగూరావ్, నాయకులు మోహన్‌నాయక్, అంజిరెడ్డి, ఎజాస్, కృష్ణారెడ్డి, పాతబాలకృష్ణ, పా ల్త్య విఠల్, హరిదాస్, హరిసింగ్, సంగ్రాంనాయక్, నర్రె నర్సింలు, ప్రతాప్‌సింగ్, అంబర్‌సింగ్, బన్సీలాల్, శ్రీనివాస్, ప్రేమ్‌సింగ్, పద్మ, రేఖ, జన్నుబాయి తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనులకు అండగా సీఎం కేసీఆర్'



పోడు పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే, అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

పెద్దకొడప్‌గల్: అడవి బిడ్డలకు సీఎం కేసీఆర్ అండదండగా ఉన్నారని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు పోడుభూముల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంలో 532 మందికి పట్టాలు వచ్చాయన్నారు. పెద్దకొడప్‌గల్‌లో 186 మందికి, పిట్లం మండలంలో 139 మందికి, బిచ్కుంద మండలంలో 36 మందికి, జుక్కల్ మండలంలో 71 మందికి, నిజాంసాగర్ మండలంలో 100 మందికి పట్టాలు అందిస్తున్నామన్నారు. మొదటి విడతలో గిరిజనులకు మాత్రమే పట్టాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో రాణి పాల్గొన్నారు.

'రైతుబంధు' డబ్బులిస్తలేరు..

- బ్యాంకర్లు పంట రుణం కింద సర్దుబాటు చేస్తున్నారు
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో కాంగ్రెస్ సభ్యుడి ఆరోపణ
- పలు అంశాలపై సమావేశాలు



రైతు బంధుపై ప్లకార్డు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్: రైతు బంధు పథకం కింద రైతుల ఖాతాలలో జమవేస్తున్న మొత్తాన్ని బ్యాంకులు పంట రుణాల కింద సర్దుబాటు చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్‌తో పాటు దోమకొండ జెడ్పీటీసీ సభ్యుడు తిర్మల్‌గౌడ్ స్పందించారు. పెట్టుబడి సాయాన్ని పంట రుణం కింద సర్దుబాటు చేయకుండా ఉండేందుకు లీడ్ బ్యాంక్ మేనేజర్ ద్వారా అన్ని బ్యాంకులను ఆదేశించే విధంగా కలెక్టర్‌కు తక్షణమే ఉత్తరం పంపాలని తీర్మానించారు. జిల్లా పరిషత్‌లో శుక్రవారం జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అధ్యక్షతన సాంఘిక సంక్షేమం, మహిళాశిశు సంక్షేమం స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. సాయంత్రం వైస్ చైర్మన్ పి.ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన వ్యవసాయ స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాల మాఫీ హామీని తుంగలో తొక్కిందంటూ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి ప్లకార్డు ప్రదర్శించారు. పంట రుణాలు మాఫీ చేసిన తర్వాతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని జెడ్పీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నేత పేర్కొన్నారు. అకాల వర్షాలతో వరి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో జాప్యంపై కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ప్రశ్నించగా.. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే రైతులకు అందజేస్తామని వ్యవసాయాధికారి సమాధానమిచ్చారు. వానలు కురియనందున వరికి బదులుగా మక్క పంట వేయడానికి విత్తనాలు సరఫరా చేసే ఆలోచనేదీ లేదన్నారు. జిల్లాలో భూసార పరీక్ష కేంద్రం లేదని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకురాగా.. వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకువెళ్తామని జెడ్పీ వైస్ చైర్మన్ పేర్కొన్నారు. కుక్కల దాడిలో గొర్రెలు నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వడానికి ప్రత్యేక నిధులు ఏమీ లేవని జిల్లా పశువైద్యాధికారి సింహారావు తెలిపారు. భిక్కనూరు 132 కేవీ సబ్ స్టేషన్‌లో 31 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు తాటిపాముల పద్మ కోరారు. పోడు పట్టాల పంపిణీ కోసం జిల్లాలో 11,389 ఎకరాలకుగానూ 5,015 మంది రైతులను గుర్తించినట్టు జెడ్పీ చైర్‌పర్సన్ శోభ తెలిపారు. జెడ్పీ సీఈవో డి.సాయాగౌడ్, తాడ్వాయి, పిట్లం జెడ్పీటీసీ సభ్యులు బత్తుల రమాదేవి, అరిగెల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పీజీ కళాశాలగా మారుస్తాం'



రాజగోపాల్ దంపతులను సన్మానిస్తున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: అధికారంలోకి వస్తే కామారెడ్డి పట్టణంలోని బీటెక్ డెయిరీ టెక్నాలజీ కళాశాలను పీజీ కళాశాలగా మారుస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో డెయిరీ టెక్నాలజీ విభాగాధిపతి రాజగోపాల్ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో షబ్బీర్ అలీ పాల్గొని రాజగోపాల్ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కోసం రాజగోపాల్ చేసిన కృషిని అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఐరేని సందీప్, గోనె శ్రీనివాస్, పంపరి లక్ష్మణ్, చంద్రశేఖర్, వడ్ల సురేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'టెక్నాలజీని వినియోగించుకోవాలి'



గణాంకదర్శిని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్: గణాంక శాఖ సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నివేదికలు తయారు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సేకరించిన గణాంకాలు ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు ఉపయోగకరంగా ఉంటే నిర్ణయాలు తీసుకోవడానికి సులభంగా ఉంటుందన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో 17వ జాతీయ గణాంక దినోత్సవం నిర్వహించారు. గణాంక శాస్త్రవేత్త పీసీ మహలానోబిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ సర్వే, నివేదికలు తయారు చేయాలని సూచిచంఆరు. గణాంకాల సేకరణ ప్రాముఖ్యత గురించి సీపీవో రాజారాం వివరించారు. ఈ సందర్భంగా విశ్రాంత గణాంక అధికారులు మహిజాదేవి, దత్తాద్రి, నరేందర్‌రెడ్డిలను సన్మానించారు. కామారెడ్డి జిల్లా గణాంక దర్శిని 2021–22 పుస్తకాన్ని కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఉపగణాంక అధికారులు, క్షేత్రస్థాయి ఉపగణాంక అధికారులు, మండల ప్రణాళిక గణాంక అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెయూలో బయోమెట్రిక్ హాజరు

తెయూ(డిచ్‌పల్లి) : తెయూలో శనివారం (జూలై 1) నుంచి బయోమెట్రిక్ హాజరు అమలు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి సర్క్యులర్ జారీ చేశారు. పని వేళలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. అసాధరమైన, అత్యవసరమైన సమయంలో మాత్రం బోధన, బోధనేతర సిబ్బంది హాజరు నమోదుకు అరగంట అదనపు సమయం అవకాశం ఉంటుందన్నారు. ఒక నెలలో మూడు సార్లు సకాలంలో బయోమెట్రిక్ హాజరు నమోదు చేయని వారికి ఒక రోజు గైర్హాజరు (సీఎల్/ఈఎల్/ ఎల్‌వోపీ)గా పరిగణిస్తారని రిజిస్ట్రార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను ఆయా విభాగాధిపతులు కఠినంగా అమలు చేయాలని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

4లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ 2వ, 4వ, 6వ, 8వ, 10వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షల ఫీజు జూలై 4వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో జూలై 6 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు.

2న ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 2న సబ్‌జూనియర్ బాలికల విభాగంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ షకీల్, ఎండీ జావిద్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మధ్యాహ్నం 1 గంటలకు ఎంపికలు ఉంటాయని చెప్పారు. 01-01-2010 నుంచి 31-01-2013 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు బోనఫైడ్ తీసుకోని రావాలన్నారు.

నేటి నుంచి పాలిసెట్ తుది విడత కౌన్సెలింగ్

సుభాష్‌నగర్: పాలిటెక్నిక్ ప్రవేశ తుది విడత కౌన్సెలింగ్ ప్రక్రియ జూలై 1 నుంచి ప్రారంభం అవుతుందని జిల్లా సమన్వయకర్త సి శ్రీరామ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ మొదటి విడతలో పాల్గొనని విద్యార్థులు తుది విడతకు సంబంధించి శుక్రవారం స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు జూలై 2న సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం సంబంధిత హెల్ప్‌లైన్ సెంటర్‌కు వెళ్లాలని పేర్కొన్నారు. వెరిఫికేషన్ అయిన తర్వాత జూలై 1 నుంచి 3వ తేదీ వరకు కళాశాలలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. పాలిసెట్-23 మొదటివిడతలో హాజరైన విద్యార్థులు వెబ్‌ఆప్షన్‌ను పెట్టుకోవాలన్నారు. మొదటివిడతలో సీటు రాని వారు, సీటు వచ్చి కూడా కళాశాల మార్పిడి కోసం ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రూ.ఏడు కోట్లతో బట్టల వ్యాపారి పరార్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ఆర్‌కే కాంప్లెక్స్‌లో రెడిమేడ్ దుస్తుల వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారి సుమారు రూ.ఏడు కోట్లకు టోకరా వేసి పరారైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వ్యాపారి గత కొన్నేళ్లుగా పట్టణంలో వ్యాపారం చేస్తున్నాడు. కాగా 15 రోజుల క్రితం తన దుకాణానికి తాళాలు వేసి మళ్లీ తెరవలేదు. వ్యాపారికి అప్పులు ఇచ్చిన వారు వాకబు చేయగా సొంత రాష్ట్రానికి ఉడాయించినట్లు తెలిసింది. దీంతో అప్పులు ఇచ్చిన వారు శుక్రవారం రాజస్థాన్ బయలుదేరి వెళ్లారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అందుబాటులో పసుపు మొక్కలు

- కమ్మర్‌పల్లి పరిశోధన కేంద్రంలో 2 లక్షల మొక్కల పెంపకం
- ఒక్కో ఎకరానికి 30వేల మొక్కలు సరఫరా
- ఇప్పటికే 180 క్వింటాళ్ల విత్తనం పంపిణీ



పసుపు పరిశోధన స్థానం నుంచి మొక్కలను తీసుకువెళ్తున్న రైతులు

మోర్తాడ్: పసుపు సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహం అందించడానికి కమ్మర్‌పల్లి పరిశోధన కేంద్రం వివిధ రకాలైన వంగడాలను, కొత్త విధానంలో సాగుకు అవసరమైన మొక్కలను అందుబాటులోకి తీసుకు వచ్చింది. వర్షాకాలం సాగు ఆరంభం కావడంతో ఇప్పటికే 180 క్వింటాళ్ల పసుపు విత్తనాలను పంపిణీ చేశారు. రెండు లక్షల మొక్కలను పెంచగా ఇప్పటికే 20వేల మొక్కలను రైతులు తీసుకెళ్లారు. మరో 1.80లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వర్షాలు ఆలస్యం కావడంతో పసుపు సాగు చేసే రైతులు విత్తనం విత్తడానికి బదులు మొక్కలను నాటితే ప్రయోజనకరంగా ఉంటుందని పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త వెల్లడిస్తున్నారు. పసుపు విత్తనానికి సంబంధించి ప్రగతి, రాజ్‌పురి, పితాంబర్, రాజేంద్ర సోనియా, దుగ్గిరాల తదితర రకాలను పంపిణీ చేశామని తెలిపారు. మొక్కలలో సేలం రకం, ప్రగతి, రాజేంద్ర సోనియా రకాలు ఉన్నాయని చెప్పారు. ఒక్కో ఎకరానికి 30వేల మొక్కలను నాటాల్సి ఉంటుంది. మొక్కలను నాటే రైతులు ప్రయోగాత్మకంగా అర ఎకరం, అంతకు తక్కువ ఎకరంలో మొక్కలను నాటి పసుపు దిగుబడి పరిశీలిస్తే వచ్చే ఏడాది మరింత ఎక్కువగా మొక్కలు పంపిణీ చేయడానికి అవకాశం ఉంటుంది. ఇది వరకు మొక్కలను పంపిణీ చేసినా ఫలితాలను విశ్లేషించలేదు. ఈ సంవత్సరం నుంచి పంట దిగుబడిని పరిశీలించి మెరుగైన ఫలితాలు లభిస్తే రైతులకు విస్తృతంగా మొక్కలను అందుబాటులోకి తీసుకవచ్చే అవకాశం ఉంది.

మేలు రకాలు పంపిణీ చేస్తున్నాం



పసుపు పంటకు సంబంధించి మేలు రకాలైన విత్తనాలను తీసుకు వచ్చి రైతులకు పంపిణీ చేస్తున్నాం. ఫలితాల ఆధారంగా వచ్చే ఏడాది మరిన్ని ఎక్కువ ఎకరాలకు మొక్కలు, విత్తనాలను పంపిణీ చేస్తాం. పసుపు దిగుబడి పెంచడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నాం.

– మహేందర్, శాస్త్రవేత్త, పసుపు పరిశోధన స్థానం కమ్మర్‌పల్లి

జీతాలు రాక అవస్థలు

- ఈఎస్ఐ కార్మికులకు ఏడు నెలలుగా అందని వేతనాలు
- పట్టించుకోని ఏజెన్సీ నిర్వాహకులు



ఈఎస్ఐలో పనిచేస్తున్న కార్మికులు

నిజామాబాద్ సిటీ: పొట్ట కూటి కోసం పనిచేసే కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు అందడం లేదు. దీంతో ఆ కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లా కేంద్రంలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో ఏజెన్సీ కింద పనిచేసే కార్మికులకు జీతాలు రాకపోవటంతో అప్పులు చేస్తూ రోజులు వెల్లదీస్తున్నారు. ఆస్పత్రిలో పారిశుధ్యం, హౌస్ కీపింగ్‌లో 14 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ పనుల కోసం టెండర్లు వేయగా నిజామాబాద్ పట్టణ మహిళా సమాఖ్య సంఘం దక్కించుకుంది. నిబంధనల ప్రకారం కేంద్రం నుంచి ప్రతిమూడు నెలలకు ఒకసారి చేసిన డబ్బులకు జీతాలు వస్తుంటాయి. కానీ కార్మికులకు మాత్రం ప్రతినెలా జీతాలు ఏజెన్సీవారే చెల్లించాల్సి ఉంటుంది. కేంద్రం నుంచి డబ్బులు రావటం లేదని ఏడు నెలలుగా జీతాలు చెల్లించటంలేదు. దీంతో అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాల గురించి అడుగుదామంటే ఏజెన్సీ నిర్వాహకులు రావటంలేదని వాపోతున్నారు.

ఇల్లు ఖాళీ చేయమంటున్నారు



ఏడు నెలలుగా జీతం డబ్బులు ఇవ్వటం లేదు. దాంతో ఇంటి అద్దె చెల్లించలేదు. ఇంటి యజమానులు ఇల్లు ఖాళీ చేయమంటున్నారు. సిలిండర్‌కు డబ్బులు లేక కట్టెల పొయ్యిపై వంట చేసుకుంటున్నాం.

– ఎల్ సావిత్రి, కార్మికురాలు

పిల్లలు ఇంటివద్దే ఉంటున్నారు



జీతాలు రాక పిల్లల స్కూల్ ఫీజు లు చెల్లించలేదు. దీంతో వారు ఇంటివద్దే ఉంటున్నారు. కాంట్రాక్టర్‌కు డబ్బులు రాకుంటే మాకేం సంబంధం. మూడు నెలలకు ఒకసారి అయిన జీవం ఇవ్వాలి కదా.

– మైసమ్మ, కార్మికురాలు

కడుపులోనే ఖతం చేస్తుండ్రు

- విచ్చలవిడిగా అబార్షన్లు
- ఆడపిల్లలపై కొనసాగుతున్న వివక్ష

మాచారెడ్డి : మాచారెడ్డి మండలంలోని ఓ తండాకు చెందిన జంటకు మొదటి కాన్పులో ఆడ పిల్ల పుట్టింది. రెండోసారి బిడ్డ మగ బిడ్డ కావాలని కలలు కన్నారు. ఆమె ఇటీవల గర్భం దాల్చింది. నాలుగు, ఐదు నెలల మధ్య లింగ నిర్ధారణ పరీక్ష చేయించారు. ఆడ పిల్ల అని నిర్ధారణ కాగానే అబార్షన్ చేయించారు. మండలంలోని మరో గ్రామంలో ఓ జంటకు మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టింది. మూడేళ్ల తరువాత రెండో సారి గర్భం దాల్చిన తరువాత ఆ మహిళకు లింగ నిర్ధారణ పరీక్ష చేయించారు. ఆడపిల్ల అని తెలియడంతో అబార్షన్ చేయించారు. ఇలా ఎంతో మంది కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే అంతం చేస్తున్నారు. ఆడపిల్లల కోసం ప్రభుత్వాలు ఎన్నో పథకాలు తీసుకువచ్చాయి. చదువుతో పాటు ఉద్యోగాల్లో వారికి అవకాశాలు కల్పిస్తున్నాయి. అయినా ఆడపిల్లల మీద తల్లిదండ్రులకు వివక్ష పోవడం లేదు. కడుపులో పెరుగుతున్నది ఆడనో, మగనో తెలుసుకునేందుకు లింగనిర్ధారణ పరీక్షలు చేయించడం, ఆడపిల్ల అని తెలిస్తే చాలు కడుపులోనే కడతేరుస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేయడం చట్ట ప్రకారం నేరమని తెలిసినా కొందరు అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని దర్జాగా చేస్తున్నారు. మాచారెడ్డి మండలంలో గత ఏడాది జూన్ నుంచి నేటి వరకు జరిగిన కాన్పుల్లో 311 మంది మగ పిల్లలు, 266 మంది ఆడపిల్లలు జన్మించారు. అంటే మగ పిల్లల కన్నా ఆడపిల్లలు 45 మంది తక్కువగా ఉన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో కొందరు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్లలో విచ్చలవిడిగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ అడ్డగోలుగా దండుకుంటున్నారు. చట్ట విరుద్ధంగా జరుగుతున్న లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్ల విషయంలో జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



ప్రతీ నెలా చెకప్ కోసం మా వద్దకు వచ్చే గర్భిణులకు ఆడ పిల్లలు, మగపిల్లలు సమానమేనని అవగాహన కల్పిస్తున్నాం. ఆడపిల్లల్ని మగ పిల్లలతో సమానంగా చదివించాలని, వివక్ష చూపొద్దని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ సతీష్, మండల వైద్యాధికారి, మాచారెడ్డి

స్కూల్ బస్సులకు చలాన్లు

మోపాల్ : నిజామాబాద్ నుంచి మోపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తున్న అన్ని స్కూళ్లకు సంబంధించిన బస్సులను శుక్రవారం ఎస్‌హెచ్‌ఓ మహేష్ తనిఖీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టామని తెలిపారు. తనిఖీల్లో ధ్రువపత్రాలు లేని వాహనాలకు, పరిమితిని మించి విద్యార్థులను బస్సులో తరలించడం, అటెండర్ లేని బస్సుల గుర్తింపు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు లేని బస్సులకు రూ.11,500 చలాన్లు విధించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మహేష్ మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యాలు పరిమితికి మించి విద్యార్థులతో ప్రయాణం చేయించవద్దన్నారు.

విదేశాల్లో ఉద్యోగాలకు టామ్‌కామ్ ద్వారా శిక్షణ

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్), తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా విదేశాల్లో ఉద్యోగాలకు శిక్షణ ఇచ్చి ఎంపిక చేస్తామని జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జపాన్, జర్మనీ, యూఎస్ఏ, యూకే, కెనడా వంటి దేశాల్లో ఉద్యోగాల కోసం ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నర్సింగ్, మదర్ టీచర్, సోషల్ స్టడీస్, ఆర్ట్స్, ఎకనామిక్స్, డ్యాన్సు టీచర్ ఖాళీలు ఉన్నాయని వీటిని భర్తీ చేయడానికి శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థి వయస్సు 25–45 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. బీఈడీ రెగ్యులర్‌తో పాటు సీబీఎస్‌ఈ పాఠశాలలో 2–3 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.79వేల నుంచి రూ. 1.2లక్షల వరకు వేతనం, వసతి, రవాణా, వైద్య, బీమా ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు 8328602231, 7893566493, 9640630420 నంబర్లను సంప్రదించాలన్నారు. అలాగే బయోడేటాను www. tomcom. itcoordinator@gmail. com కు పంపాలని సూచించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

నిజామాబాద్‌నాగారం:హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో నాలుగు, ఐదో తరగతిలో ప్రవేశాల కోసం జిల్లా స్థాయి ఎంపికలు ఈ నెల 11న నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న ఒక ప్రకటనలో తెలిపారు. నాగారంలోని రాజారాం స్టేడియంలో ఉదయం 9.00 గంటలకు ఎంపికలు ప్రారంభం అవుతాయన్నారు. ఈ నెల 5న మండలస్థాయిలో ఎంపికలు నిర్వహించుకోని ప్రతిభ చూపిన వారిని జిల్లాస్థాయికి తీసుకు రావాలన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్లు, 10 ఫొటోలు, మూడు, నాలుగో తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్ కాపీలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకొని రావాలని సూచించారు. వివరాలకు 9701177144 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్: ఇంజినీరింగ్‌లో ప్రవేశ ప్రక్రియ (ఎంసెట్-2023)లోభాగంగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం కొనసాగింది. 610 మంది విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని నిజామాబాద్ సాంకేతిక కళాశాల ప్రిన్సిపాల్, సమన్వయకర్త శ్రీరామ్‌కుమార్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన జూలై 6వ తేదీ వరకు చేసుకోవచ్చన్నారు. పరిశీలన పూర్తయిన విద్యార్థులు జూలై 8వ తేదీ వరకు కళాశాలలు ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

రెచ్చిపోయిన ఆకతాయిలు

- విద్యుత్ లైన్‌పై ఫెన్సింగ్ వైర్ వేసి..
- సరఫరాకు అంతరాయం



విద్యుత్ లైన్‌పై ఉన్న ఫెన్సింగ్ తీగ

మోర్తాడ్: మోర్తాడ్‌లో ఆకతాయిల ఆగడాలకు అంతులేకుండా పోతుంది. గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి విద్యుత్ లైన్‌పై ఫెన్సింగ్ వైర్‌ను విసిరివేయడంతో మూడు, నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భూదానంకు వెళ్లే మార్గంలో కొందరు మద్యం తాగి కంచె తీగెను ఎస్ఎస్ 174 /100 ట్రాన్స్‌ఫార్మర్ వద్ద హెచ్‌టీ, ఎల్‌టీ తీగలను తాకేలా వేయడంతో బ్రేక్ డౌన్ అయ్యింది. రాత్రి 11.30 గంటల సమయంలో ఎలాంటి గాలి దుమారం లేకపోయినా బ్రేక్‌డౌన్ కావడానికి కారణం తెలియక విద్యుత్ సిబ్బంది పడ్డారు. మూడు గంటల పాటు విద్యుత్ లైన్‌లను చెక్ చేస్తూ బ్రేక్‌డౌన్‌కు కారణం గుర్తించారు. ఫెన్సింగ్ వైర్‌ను బలంగా విద్యుత్ తీగలపై విసిరి వేయడంతో సరఫరా నిలిచిపోయింది. మోర్తాడ్ జేఈ సత్య ప్రకాష్ సూచన మేరకు లైన్‌మన్ రామస్వామి విద్యుత్‌లైన్‌లపై ఉన్న ఫెన్సింగ్ వైర్‌ను తొలగించడంలో సమస్యకు పరిష్కారం లభించింది. గతంలో ఇదే మాదిరిగా బ్రేక్‌డౌన్‌కు కొందరు ప్రయత్నించారు. ఇళ్లలో చోరీకి ప్రయత్నించడానికి దుండగులు విద్యుత్ సరఫరాకు అంతరాయం సృష్టించారా అనే సందేహం వ్యక్తమైతుంది. పోలీసులు స్పందించి పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని పలువురు కోరుతున్నారు.

క్రైం కార్నర్

ఒకరి ఆత్మహత్య



గంగచంద్రభూషణ్(ఫైల్)

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని నగరంలోని కోజాకాలనీ వద్ద జైపూర్ రైలు కింద పడి కోటగల్లికి చెందిన గంగచంద్రభూషణ్(42) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రణయ్ తెలిపారు. గురువారం రాత్రి 10:30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాగర్ కాలువలో మహిళ మృతదేహం

రుద్రూర్: వర్ని మండలం తగిలేపల్లి శివారులోని నిజాంసాగర్ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఉదయం పొలాలకు వెళ్తున్న రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు.

యువతి అదృశ్యం

బాల్కొండ:మండలంలోని కిసాన్‌నగర్‌కు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై గోపి తెలిపారు. సదరు యువతి జూన్ 27న హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అంబారిపేటలో గోవధ

నలుగురిపై కేసు నమోదు

దోమకొండ: మండలంలోని అంబారిపేట గ్రామంలో శుక్రవారం ఎలాంటి అనుమతులు లేకుండా గోవధ చేశారు. మూడు ఆవుల తలలను నరికి వాటి మాంసం విక్రయించే ప్రయత్నం చేశారు. వెంటనే గ్రామస్తులు విషయం పోలీసులకు తెలియజేశారు. దీంతో ఎస్సై సుధాకర్ అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా గోవధ చేశారని గుర్తించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అంజిబాబు ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన ఇమామ్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మొరం టిప్పర్ల పట్టివేత

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ తండా పరిధిలోగల గుట్ట నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో జి మహేష్ శుక్రవారం తెలిపారు. గుట్ట నుంచి మొరం తవ్వుతున్నట్లు సమాచారం రావడంతో అక్కడి వెళ్లి పరిశీలించామన్నారు. తవ్వకాలకు సంబంధించి వే బిల్లులు, అనుమతి పత్రాలు లేకపోవడంతో టిప్పర్లను పట్టుకున్నట్లు చెప్పారు. నాలుగు టిప్పర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురికి గాయాలు

నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్‌లో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వద్ద శుక్రవారం రాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు.. నస్రుల్లాబాద్ గ్రామానికి చెందిన వినయ్‌కుమార్ దుర్కిలో జూనియర్ లైన్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఆయన విధులు ముగించుకొని వస్తుండగా.. నస్రుల్లాబాద్ నుంచి బొమ్మన్‌దేవ్ పల్లి క్రాస్ రోడ్డు వైపు వెళ్తున్న అన్నదమ్ములు ప్రవీణ్, శ్రీనివాస్ బైక్‌తో ఢీకొన్నారు. ఘటన స్థలానికి ఎస్సై రంజిత్ రెడ్డి చేరుకుని క్షతగాత్రులను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వినయ్‌కుమార్ కుడి కాలు పూర్తిగా నలిగి పోగా, ప్రవీణ్, శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

చీరల చోరీ కేసులో ఐదుగురి అరెస్టు

నిజామాబాద్ సిటీ: చీరలు వ్యాపారం చేసే స్నేహితుడికి మాయమాటలు చెప్పి రప్పించి అతడిని బెదిరించి చీరలు, సెల్‌ఫోన్లు ఎత్తుకుపోయిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు., విశాఖపట్నం పెద్దటూరి మండలం, చిన్న మూసి గ్రామానికి చెందిన చుక్కల శ్రీరాములు చీరల వ్యాపారం చేస్తుంటాడు. ఇతని స్నేహితుడు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం, తాటిపర్తి గ్రామానికి చెందిన పంపన దుర్గాప్రసాద్ మగ్గం పనిచేస్తుంటాడు. శ్రీరాములు వద్ద చీరలు దొంగలించేందుకు దుర్గాప్రసాద్ పన్నాగం పన్నాడు. దాంతో తాటిపర్తి గ్రామానికి చెందిన డ్రైవర్ పనిచేసే దాసం వీర మణికంఠ, క్లినర్ విశ్వనాధుని శ్రీనివాస్, డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామానికి చెందిన దియ్య సాయికుమార్, బాల నేరస్తుడి సాయంతో పథకాన్ని రూపొందించాడు. ఇందులో భాగంగా దుర్గాప్రసాద్ శ్రీరాములుకు ఫోన్ చేసి నిజామాబాద్‌కు రూ.ఐదు లక్షలు విలువగల చీరలు తీసుకురావాలని తనకు తెలిసిన మహిళలు తీసుకుంటారని నమ్మించి రప్పించారు. గత నెల 11న అయిదుగురు కలిసి ఇన్నోవా కారులో శ్రీరాములు, అతనితో పాటు వచ్చిన మామను ఎక్కించుకుని నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం గండి వైపు తీసుకెళ్లారు. గండిలో కారును ఆపి అయిదుగురు శ్రీ రాములును, అతడి మామను బెదిరించి వారి వద్ద గల 90 చీరలను, నాలుగు ఏటీఎం కార్డులు, మూడు సెల్‌ఫోన్లు ఎత్తుకుని పారిపోయారు. అనంతరం బాధితుడు ఈ విషయమై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకునేందుకు రంగంలోకి దిగారు. నిందితులు డిచ్‌పల్లి మండలం ధర్మారం వద్ద ఉన్నారనే సమాచారంతో శుక్రవారం పోలీసులు అక్కడకు వెళ్లి పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.60లక్షల విలువగల 48 చీరలు, నాలుగు స్మార్టు ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని ఏసీపీ కిరణ్‌కుమార్ అభినందించారు.



విశాలమైన రోడ్డు.. ఇరువైపులా పచ్చని చెట్లు.. ఆ దారిన వెళ్లే ప్రయాణికులకు కనువిందు చేస్తోంది ఈ ప్రాంతం. నిజామాబాద్ నగర శివారులోని మల్లారం గండి అటవీప్రాంతం గుండా వెళ్లే వాహనదారులు ఈ ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తూ ప్రయాణం చేస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

జోరుగా గుట్కా దందా

- మహారాష్ట్ర నుంచి దిగుమతి
- విచ్చలవిడిగా విక్రయాలు

సదాశివనగర్: మండలంలోని తిర్మన్‌పల్లికి చెందిన ఓ వ్యక్తి గుట్కా విక్రయాలు చేపడుతున్నాడని పక్కా సమాచారంతో గతేడాది పోలీసులు దాడులు చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కా సంచులను స్వాధీనం చేసుకున్నారు. చిన్న కేసుతో సరిపెట్టారు. ఆ వ్యాపారి మళ్లీ గ్రామాల్లో తిరుగుతూ బహిరంగంగా గుట్కా విక్రయాలు చేపడుతున్నాడు. అయిన అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నిషేధం విధించిన జిల్లా వ్యాప్తంగా గుట్కా విక్రయాలు గుట్టు చప్పుడుకాకుండా సాగుతున్నాయి. ఈ విక్రయాలపై అధికారుల నిఘా పూర్తిగా కొరవడిందనే చెప్పవచ్చు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో గుట్కా దందా విచ్చల విడిగా సాగుతోంది. అధికారులు నామమాత్రపు దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గుట్కా ప్యాకెట్లను మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రాన్ని అడ్డాగా చేసుకొని వ్యాపారాన్ని నడిపిస్తున్నారు. నిషేధం అడ్డుగా పెట్టుకొని దుకాణదారులు అధిక ధరలకు గుట్కా ప్యాకెట్లను విక్రయిస్తున్నారు. గుట్కా విక్రయాలపై గతంలో కేసులు నమోదు అయినా తమ వ్యాపారాన్ని మాత్రం ఇప్పటికీ కొనసాగిస్తునే ఉన్నారు.

భూ తగాదాలో ఒకరికి గాయాలు

రాజంపేట: భూ తగాదాలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన రాజంపేటలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నాయిని జ్యోతి, నాయిని శ్రీనివాస్‌కు వ్యవసాయ భూమిలో దారి కోసం కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం శ్రీనివాస్ భూమిలో దారితో సహా జ్యోతి కుటుంబ సభ్యులు దున్నుతుండగా ఆయన అడ్డుకున్నాడు. దీంతో జ్యోతి, ఆమె తండ్రి బాలయ్య, కుమారులు స్నేహిత్, సృజాంత్, ఇతరులు దొబ్బల బీమయ్య, కందారపు బాలయ్యతో పాటు మరికొంత మంది కర్రలు, రాడ్లతో శ్రీనివాస్‌పై దాడి చేశారు. శ్రీనివాస్ భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కిష్టాపూర్‌లో కార్డన్ సెర్చ్

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలం కిష్టాపూర్‌లో శుక్రవారం సీఐ మురళి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 80 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నస్రుల్లాబాద్ ఎస్సై రంజిత్ రెడ్డి, బీర్కూర్ ఎస్సై బాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.